అన్నభావుసాతే ఆశయ సాధనకు కృషి చేయాలి

మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

జైనూర్ ఆగస్టు16 : అన్నభావుసాతే ఆశయ సాధనకు కృషి చేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో భారత సాహిత్య రత్న డాక్టర్ అన్నభావుసాతే 14వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. వంజారి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ ముండే, మాంగ్ సమాజ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మొహళే దత్తా, అధ్యక్షుడు పుల్లారే విజయ్, మహారాష్ట్ర ప్రముఖ సమాజ ప్రభోదకుడు వికాస్ రాజ్ కుడ్మెత, చంద్రపూర్ ప్రముఖ ప్రభోదకుడు రాహుల్ గాయ్కవాడ్, అంబేద్కర్ అసోసియేషన్ నాయకులు అన్నారావ్ కాంబ్లె, బాబాసాహేబ్ కాంబ్లె, అశోక్ కాంబ్లె, పండరి భండారే, బాబు గౌక్వాడ్, సోన్‌కాంబ్లె, మొహళే భారత్, శివానంద్, పోచిరాం, పుల్లారే సాపాన్ మహారాజ్, మాజీ ఎంపీపీ కుమ్ర తిరుమల విశ్వనాథ్, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మణ్, బీఆర్ఎస్ నాయకులు మెస్రం అంబాజీరావ్, కనక రాంజీ, ఆత్రం భీంరావ్, అన్నభావుసాతే జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు ఉన్నారు.

రైస్‌మిల్లు సీజ్

రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ, ఎస్ఐ

మందమర్రి రూరల్, ఆగస్టు 16 : మండలంలోని ఆదిలాపేటలో నీలం బ్రదర్స్ రైస్ మిల్లును శుక్రవారం అధికారులు సీజ్ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ పోశయ్య, అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నీలం బ్రదర్స్ రైస్ మిల్లుకు శుక్రవారం తెల్లవారు జామున 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం వస్తున్నాయని టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. ఆ మేరకు మిల్లు వద్ద కాపుకాశారు. సుమారు రూ. 94,845 విలువగల 25 క్వింటాళ్ల బియ్యాన్ని మిల్లు నిర్వాహకులు కొనుగోలు చేస్తుండగా పట్టుకున్నారు. ఆపై మిల్లును సీజ్ చేశారు. తదుపరి విచారణ కోసం ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని అధికారులు తెలిపారు. రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్, ఏఎస్ఐ వెంకన్న ఉన్నారు.

తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగినరైతులు

రిజిస్ట్రేషన్ చేస్తారా.. లేదా?

● తహసీల్దార్‌తో రైతుల వాగ్వాదం ● మందు డబ్బాతో కార్యాలయం వద్ద హల్‌చల్
● సముదాయించి పంపిన ఎస్ఐ, తహసీల్దార్

మందు డబ్బాతో ఆందోళన చేస్తున్నరైతు

నెన్నెల,ఆగస్టు16 : కొనుగోలు చేసిన పట్టా భూమిని రిజిస్ట్రేషన్ చేస్తారా.. లేదా అంటూ ఇద్దరు రైతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగిన ఘటన మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కేంద్రంలో శుక్రవారం జరిగింది. వివరాలిలా.. గొల్లపల్లిలో సర్వే నం 332 ,336/1/1,336/1/2,335/1లో దమ్మ సునీతకు కొంత భూమి ఉండగా, గొల్లపల్లికి చెందిన చింత విఘ్నేష్, విష్ణుకు విక్రయించారు. అట్టి భూమి పట్టా కోసం కొనుగోలుదారులు వారి కుటుంబ సభ్యుల పేరిట ధరణిలో స్లాట్ బుక్ చేసుకున్నారు. శుక్రవారం అమ్మకం దారులు, కొనుగోలుదారులు రిజిస్ట్రేషన్ కోసం డాక్యుమెంట్లతో వచ్చారు. తహసీల్దార్ రమేశ్‌కు వాటిని అందజేయగా పరిశీలించి.. ఈ సర్వే నంబర్‌లపై ఇందూరి రాజేశ్వర్‌రావు ఫిర్యాదు చేశారని, విచారణ చేసిన తర్వాతే పట్టా చేస్తానని చెప్పారు. ఇందుకు విఘ్నేష్, విష్ణు ఇప్పుడే పట్టా చేయాలని పట్టుబట్టారు. తహసీల్దార్‌తో గొడవకు దిగారు. పట్టా చేస్తారా లేదా అంటూ రైతులు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగారు. మందు డబ్బా పట్టుకొని తాగుతామంటూ బెదిరించారు. విషయం తెలుసుకున్న నెన్నెల ఎస్ఐ ప్రసాద్ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని రైతులను సముదాయించారు. వారి వద్ద నుంచి పురుగుల మందు డబ్బాను లాక్కున్నారు. అయిన వినకుండా విష్ణు మరో డబ్బా తీసుకొని వచ్చి తాగడానికి యత్నించారు. ఎస్ఐ మరోసారి వారిని అడ్డుకున్నారు. చివరకు తహసీల్దార్ రమేశ్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. వారి ఆదేశాల ప్రకారం విచారణ చేపట్టి రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పారు. పోలీసులు రైతులను సముదాయించి ఇంటికి పంపించారు.

పిడుగుపడి ఇద్దరు మృతి

కెరమెరి, ఆగస్టు 16 : కెరమెరి మండల కేంద్రానికి చెందిన దరి రమేశ్ (30) అనే కూలీ శుక్రవారం పిడుగు పడి మృతి చెందాడు. కెరమెరి నుంచి చింతకర్ర గ్రామం వెళ్లే దారిలో షేక్ హుస్సేన్‌కు చేనులో పని చేస్తుండగా మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో పిడుగు పడింది. దీంతో రమేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య దరి సుమిత్ర ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 16 : ఆసిఫాబాద్ మండలంలోని నందుప గ్రామానికి చెందిన ధౌత్రే అంజన్న (20) శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. తమ వ్యవసాయ భూమిలో పనులు ముగించుకొని ఇంటికి వస్తున్న క్రమంలో మార్గ మధ్యంలో పిడుగు పాటుకు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు అంజన్నను కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేటు దవాఖానకు చికిత్స నిమిత్తం తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

రుణం తీరలే..!

రూ. రెండు లక్షలు మాఫీ చేయకుండానే సీఎం రేవంత్ గొప్పలు

● అసలు మూడో విడుత లిస్టే రాలేదంటూ ఏఈవోల మెస్సేజ్‌లు ● రైతుల ఖాతాల్లో పడని డబ్బులు
● రుణం ఉన్నోళ్లు ఎందరు.. మాఫీ అయినోళ్లు ఎందరు అన్నదానిపై స్పష్టత కరువు ● అయోమయంలో అన్నదాతలు ● కాంగ్రెస్ సర్కారు తీరుపై ఆగ్రహం

మంచిర్యాల, ఆగస్టు 16(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఎన్నికలకు ముందు రూ.రెండు లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చాక మాట మార్చింది. ముందేమో డిసెంబర్ 9న రుణమాఫీ అని చెప్పి తేదీలు మార్చుకుంటూ వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి చివరకు ఏ జిల్లాకు వెళ్తే ఆ జిల్లాలో దేవుళ్లపై ఒట్లు పెడుతూ వచ్చారు. బాసర సరస్వతీ మందిరం మీద ఒట్టు వేసి మరీ ఆగస్టు 15వ తేదీలోగా రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. అమ్మవారి గుడిపై ఒట్టేసి ఇచ్చిన హామీ నెరవేరకముందే రుణమాఫీ పూర్తి చేశామంటూ సీఎం రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్పుకోవడంపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు మండిపడుతున్నారు. బాసర అమ్మవారి గుడిపై ఒట్టేసి రుణమాఫీ చేయకుండానే చేశామంటూ అబద్ధాలు చెప్పడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడో విడుతలో రూ. రెండు లక్షలు మాఫీ అని ప్రకటించినప్పుడు 15వ తేదీలోపే ఆ డబ్బులు ఖాతాల్లో జమకావాలి. కానీ ఆ రోజున ప్రారంభించి కొందరి రైతులకు చెక్కులు ఇస్తే నెరవేరినట్లు ఎలాఅవుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. పోనీ మూడో విడుత జాబితా ఏమైనా బయటకి వచ్చిందా అంటే.. అదీ లేదు. రైతుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు పడనేలేదు. వ్యవసాయ శాఖ ఏఈవోలే ఈ విషయాన్ని రైతులు ఉండే వాట్సాప్ గ్రూపుల్లో మెస్సేజ్‌ల రూపంలో పంపిస్తున్నారు. ఇవేవీ లేకుండా కేవలం రాజకీయ కక్ష సాధింపు కోసం ప్రకటన చేసిన తీరు రాష్ట్ర సర్కారును అభాసుపాలు చేస్తున్నది. చివరకు ఆగస్టు 15వ తేదీలోపు రుణమాఫీ చేయలేరు అన్న మాజీ మంత్రి హరీశ్‌రావు మాటలే నిజమయ్యాయి. దేవుళ్లపై ఒట్టేసి మరీ ఇచ్చిన హామీని నెరవేర్చకపోగా, మాఫీ చేసి రైతుల రుణం తీర్చుకున్నట్లు సీఎం రేవంత్ ప్రకటించడంపై జనాలు మండిపడుతున్నారు.

చెప్పిందొకటి.. చేసిందొకటి..

రూ. రెండు లక్షల రుణమాఫీ కోసం రూ.40 వేల కోట్లు అవుతుందని రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి ముందు ప్రకటించారు. ఎన్నికలయ్యాక రూ.31వేల కోట్లతో రుణమాఫీ చేయాలని కేబినెట్ తీర్మానించింది. మొన్నటికి మొన్న బడ్జెట్‌లో రూ.26వేల కోట్లు పెట్టి తీరా ఇప్పుడు రూ.17,934 కోట్లతో అయిపోయింది అంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగికి, పింఛన్ తీసుకునేవాళ్లకి, ఐటీ రిటర్న్స్ కట్టేవాళ్లకు, రేషన్‌కార్డ్ లేని వారికి ఇలా అనేక రకాల కొర్రీలు పెట్టి 100 మందిలో 40 మందికే మాఫీ చేసి 60 మందికి ఎగ్గొట్టింది. ఈ లెక్కన ఎన్నికల్లో ఒట్లేసి గెలిపించిన రైతులను కాంగ్రెస్ సర్కారు మోసం చేసింది. ఉమ్మడి జిల్లాలో 2.27 లక్షల మందికి రుణమాఫీ చేసినట్లు చెబుతున్న అధికారులు రూ.రెండు లక్షల లోపు రుణం తీసుకున్న రైతుల వివరాలు మాత్రం లేవని చెప్పడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. మరి అర్హుల జాబితా ఎలా రూపొందించారంటే పైనుంచి వచ్చిన లిస్టులో ఉన్నవారికి మాత్రమే మాఫీ అయినట్లు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో రూ.రెండు లక్షల లోపు రుణాలు మాఫీ కానీ వారి సంఖ్య సైతం లక్షల్లోనే ఉంటుందని, అందుకే వివరాలు బయటికి ఇవ్వొద్దని ప్రభుత్వం నుంచి ఇన్‌స్ట్రక్షన్ ఉందంటూ కొందరు అధికారులే చెప్పడం గమనార్హం. ఈ లెక్కన రుణమాఫీ కాని రైతులు ఎంత మంది ఉన్నారన్నది బయటకి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. కొందరు అర్హులకు రుణమాఫీ కాలేదని.. అలా కానీ వారు కలెక్టరేట్‌కు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలంటున్నారు. అంటే రేపటి నుంచి రైతులు సాగుపనులన్నీ వదులుకొని అధికారుల చుట్టూ తిరగాలా అంటూ అన్నదాతలు మండిపడుతున్నారు.

కేసీఆర్ సర్కారులోనే బాగుండే..

సీఎం కేసీఆర్ సర్కారు 35 లక్షల మంది రైతులకు రూ.లక్ష వరకు రూ.17వేల కోట్లు రుణమాఫీ చేసింది. ఇప్పుడు 22 లక్షల మంది రైతులకు రూ.రెండు లక్షల వరకు చేసినా రూ.17వేల కోట్లు అయ్యిందంటున్నారు. ఈ లెక్కన సగానికి సగం మందికి రుణమాఫీ కాకుండా ఎగొట్టినట్లు స్పష్టం అవుతున్నది. రుణమాఫీ కానీ రైతుల్లో ఇప్పటికే కాంగ్రెస్ సర్కారుపై నైరాశ్యం నెలకొన్నది. రుణమాఫీ కాలేదని బయటికి వచ్చి చెప్పుకోలేని దుస్థితిలో అన్నదాతలు ఉన్నారు. రుణమాఫీ కాలేదని చెబితే కాంగ్రెస్ నాయకులు ఇబ్బందులు పెడుతారని, తమను వదిలేయండి అంటూ రైతులు అంటున్నారు. కానీ కడుపు మండిన అన్నదాతలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని రైతుసంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా చేసిన తప్పుడు వాగ్దానాన్ని, రూ.రెండు లక్షల రుణం మాఫీ చేసినట్లు చేసిన ప్రకటనలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలంటున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై రుణమాఫీ కాని రైతుల అభిప్రాయాలు ఇలా..

సార్లను అడిగితే తెల్వదంటున్నరు

భీమారం, ఆగస్టు 16 : మా ఊరిలో నాకు రెండెకరాలు ఉంది. మూడేళ్ల క్రితం భీమారం ఎస్‌బీఐలో క్రాఫ్‌లోన్ రూ. 1.60 లక్షలు తీసుకున్న. మూడో విడుతలో కూడా మాకు రుణం మాఫీ కాలేదు. ఇదెక్కడి న్యాయం. గిట్లయితే అప్పు ఎలా తీర్చాలి. రైతుబంధు సాయం కూడా రాకపాయే. రుణమాఫీ కోసం సార్లను అడిగితే తెల్వదు అంటున్నరు. మంచిర్యాల కలెక్టర్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌లు పెడుతమని చెబుతున్నరు. ఇగ ఆఫీసుల పొంటి ఎక్కడ తినగాలే.. ఇటు పొలం పనులు ఎప్పుడు చేసుకోవాలే.

- కలగూర రమేశ్, కొత్తపల్లి

రుణంమాఫీ కాలే

జన్నారం, ఆగస్టు 16 : నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. గతంలో రూ 1.70 లక్షల పంటరుణం తీసుకున్న. కాంగ్రెస్ సర్కారు రూ. 2 లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామని చెబితే సంబురపడ్డ. కానీ నాకు రుణం మాఫీ కాలేదు. బ్యాంక్ రుణం దొరకక ఎక్కువ వడ్డీకి అప్పులు చేసి పంట చేస్తున్న. ఇకనైనా సీఎం రేవంత్‌రెడ్డి నా పంట రుణం మాఫీ చేసి ఆదుకోవాలి.

- డోంగ్రే బుచ్చిలింగం, అక్కపెల్లిగూడ

మంచిర్యాల పీఏసీఎస్ కార్యాలయం

నిర్లక్ష్యం నిజమే!

మంచిర్యాల సహకార శాఖలో గందరగోళం

● ఓ రైతుకు అసలు కంటే ఎక్కువ మొత్తంలో రుణమాఫీ
● కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి అధికారులు
● విచారణలో వెల్లడైన వాస్తవాలు ● ఉన్నతాధికారుల చెంతకు రిపోర్టు

మంచిర్యాల (ఏసీసీ), ఆగస్టు 16 : మంచిర్యాల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) రుణమాఫీలో అవకతవకలు జరిగినట్లు విచారణలో వెల్లడైంది. అవకతవకలపై 'నమస్తే తెలంగాణ' ఈ నెల 12న 'సహకార నిర్లక్ష్యం' పేరిట కథనం ప్రచురించిన విషయం విదితమే. అయితే సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన విచారణలో సిబ్బంది తప్పిదాల వల్లే రుణమాఫీలో పొరపాట్లు జరిగినట్లు తేలింది. పీఏసీఎస్ కార్యదర్శి పెంట సత్యనారాయణ ఆధ్వర్యంలో రైతుల రుణాలను రీ షెడ్యూల్ చేసే సమయంలో పొరపాట్లు దొర్లాయని తెలిసింది. దీంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడినట్లు అర్థమవుతోంది.

మెస్సేజ్‌లతో వెలుగులోకి..

ముల్కల్లకు చెందిన రైతు బాపుకు వాస్తవానికి రూ. 9,727 రుణమాఫీ కావాల్సి ఉండగా, సొసైటీ కార్యదర్శి రికార్డుల్లో సరిగా ఎంట్రీ చేయలేదు. దీంతో రైతు పేరు మీద రూ.1,10,515 రుణం మాఫీ అయ్యింది. నేరుగా తన సెల్‌ఫోన్‌కు మెస్సేజ్ రావడంతో ఆయన అవాక్కయ్యాడు. కార్యదర్శి పెంట సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా, పొంతన లేని సమాధానం ఇచ్చారు. దీంతో ఈ వ్యవహారం కలెక్టర్ వరకు వెళ్లింది. రుణాల రీషెడ్యూలు ఎంట్రీ చేయడంలో నిర్లక్ష్యం వహించడం వల్లే ఆ రుణ వివరాల్లో తేడాలు వచ్చినట్లు తెలుస్తున్నది. ఈక్రమంలో కలెక్టరేట్ నుంచి వచ్చిన ఆదేశాలతో విచారణ చేపట్టిన అధికారులు.. అసలు విషయాన్ని వెలుగులోకి తెచ్చారు. మొత్తం మీద అసలుకు మించి ఎక్కువగా రుణంమాఫీ అయిన సొమ్మును ప్రభుత్వానికి సహకార శాఖ రీఫండ్ చేయనున్నది.

ఫిర్యాదు చేస్తేనే..

వాణిజ్య బ్యాంకులతో పోలిస్తే సహకార శాఖలో రుణాలు కాస్త భిన్నంగా ఉంటాయి. జిల్లా వ్యాప్తంగా 20 సహకార సంఘాలు ఉండగా, చాలా చోట్ల ఇలాంటి అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. బాధితుల కోణంలో కాకుండా.. జిల్లా వ్యాప్తంగా దర్యాప్తు చేస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. నిజానికి తమ పేరిట లోను లేకపోయినప్పటికీ, రుణమాఫీ అయినట్లు మెస్సేజ్‌లు రావడంపై రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనుల కోసం తాము ఇచ్చిన పలు డాక్యుమెంట్లను వాడుకుని, తమ పేరిట రుణాలేమైనా తీసుకున్నారా..? అని కొంతమంది అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి నిర్లక్ష్యం వల్ల తాము రుణాలు తీసుకున్న చోట ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు ఆడిట్ చేసినట్లయితే ఇలాంటి పొరపాట్లు జరిగే అవకాశముండదు.

బాధ్యులపై చర్యల్లేవా..?

ఇక ఈ వ్యవహారమంతటికీ కారణమైన కార్యదర్శిపై ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఇన్‌స్పెక్టర్ నివేదికను జిల్లా ఉన్నతాధికారికి సమర్పించగా, ఆయన దాన్ని పరిశీలించి, కలెక్టరు, రిజిస్ట్రార్ ఆఫ్ సొసైటీకి నివేదించడం జరిగింది. మూడు రోజుల కిందటే ఈ నివేదికను ఉన్నతాధికారులకు పంపించగా, ఇప్పటి వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. మరోవైపు జిల్లాలోని ఇతర సహకార సంఘాల్లో కూడా దర్యాప్తు జరపాలని ప్రజలు కోరుతున్నారు. ఫిర్యాదు వస్తేనే ముందుకు కదలడంలాంటివి కాకుండా, ఉన్నతాధికారులు స్వచ్ఛందంగా ఎప్పటికప్పుడు రికార్డులు తనిఖీ చేయాలని సూచిస్తున్నారు. అప్పుడే ఇలాంటి పొరపాట్లకు తావుండదని అభిప్రాయపడుతున్నారు.

నివేదిక పంపించాం

- రామ్మోహన్, జిల్లా సహకారశాఖ అధికారి

మంచిర్యాల పీఏసీఎస్‌లో రుణమాఫీలో గందరగోళం నెలకొన్న విషయం వాస్తవమే. డేటా ఎంట్రీ సమయంలో నిర్లక్ష్యం వల్లే అది జరిగింది. రైతు బాపుకు రావాల్సిన దానికంటే ఎక్కువ మొత్తంలో రుణం మాఫీ అయింది. దీనిపై విచారణ నిర్వహించి నివేదికను పై అధికారులకు పంపించాం. ఆదేశాలు రాగానే కార్యదర్శిపై చర్యలు తీసుకుంటాం. ఎక్కడా ఇలాంటి పొరపాట్లు జరిగినట్లు ఫిర్యాదు రాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారణ చేస్తాం.

మంచిర్యాల ప్రభుత్వ దవాఖాన ఎదుట నిరసన తెలుపుతున్న వైద్యులు, నర్సులు

వైద్యులు, నర్సుల నిరసన

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 16 : కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన అమానుష ఘటనను నిరసిస్తూ శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన ఎదుట డాక్టర్లు, నర్సులు ఆందోళన చేపట్టారు. విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. కళాశాల యాజమాన్యం తమ సంస్థలను కాపాడుకోవడానికి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. వైద్య విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రెసిడెన్సి వైద్యులు, హౌస్ సర్జన్స్, వైద్య విద్యార్థులు, నర్సులు పాల్గొన్నారు.

బడిలో బోరు వేసిన్రు

కొమ్మెర జడ్పీ హైస్కూల్‌లో తాగునీటి సమస్యకు పరిష్కారం

● 'నమస్తే'కు స్పందన
పాఠశాలలో బోరు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్ రూరల్, ఆగస్టు 16 : కొమ్మెర జడ్పీ హైస్కూల్‌లో ఎమ్మెల్యే గడ్డం వివేక్ నూతన బోరు వేయించగా, విద్యార్థుల తాగు నీటి సమస్యకు పరిష్కారం లభించింది. 8 నెలలుగా విద్యార్థులు తాగు నీటికి తిప్పలు పడుతున్నారు. ఈ విషయమై ఈ నెల 7న 'నమస్తే తెలంగాణ'లో 'అన్నం తిందామంటే నీళ్లు లేవు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ విషయమై స్పెషలాఫీసర్ మల్లికార్జున్ స్పందించి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సరితను ఆదేశించగా, ఆమె పాఠశాలను సందర్శించారు. రెండు రోజుల్లో తాగు నీటి సమస్య పరిష్కరించాలని పంచాయతీ సెక్రటరీని ఆదేశించారు. కానీ.. సమస్య పరిష్కారం కాలేదు. ఈ నెల 13న 'నమస్తే తెలంగాణ'లో 'అధికారులు ఆదేశించినా తాగు నీరేది' శీర్షికన మరోసారి కథనం ప్రచురితమైంది. ఇందుకు నాయకులు స్పందించారు. ఎమ్మెల్యే గడ్డం వివేక్ సహకారంతో డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి శుక్రవారం పాఠశాల ఆవరణలో నూతన బోరు పనులు ప్రారంభించినట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకులు అయిత హిమవంత రెడ్డి తెలిపారు. బోరుకు విద్యుత్ మోటర్ ఏర్పాటు చేసి తాగునీరందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ముత్యాల బాపగౌడ్, మహేశ్ ప్రసాద్, సుధాకర్ రెడ్డి, కుంట శంకర్ గౌడ్, రాజగౌడ్, దుర్గం సమ్మయ్య, జనగామ పవన్ పాల్గొన్నారు.

98 మంది జేఎల్ ఎంలకు ఏఎల్ ఎంలుగా పదోన్నతి

మంచిర్యాలటౌన్, ఆగస్టు 16: మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా విద్యుత్ శాఖలో పనిచేస్తున్న 98మంది జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం)లకు అసిస్టెంట్ లైన్‌మెన్ (ఏఎల్ఎం)లుగా పదోన్నతులు కల్పిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా ప్రస్తుతం పనిచేస్తున్న స్థానంలోనే ఏఎల్ఎంలుగా విధుల్లో చేరాలని సూచించారు. ఈ మేరకు గురువారం రాత్రి ఉత్తర్వులు విడుదల కాగా, పదోన్నతులు పొందిన జేఎల్ఎంలందరికీ పోస్టింగ్‌లు ఇచ్చారు. అర్హతలు సరిగాలేని 10మంది వరకు జేఎల్ఎంలకు పదోన్నతులు రాలేదు.

● జన్మదిన శుభాకాంక్షలు
● పొలిటికల్
● స్వదేశాగమనం
● లీగల్ ప్రకటనలు
● క్లాసిఫైడ్స్
● పదవీ విరమణ
● ప్రారంభోత్సవం
● శ్రద్ధాంజలి
● సినిమా
● వివాహ మహోత్సవం
● షష్టిపూర్తి మహోత్సవం మరియు
● అన్ని శుభకార్యాలు
నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679